సాక్షి
నిజామాబాద్

బుధవారం | 10 | జూలై | 2024



ఏటీఎంనే ఎత్తుకెళ్లారు..!

దొంగలు ఏకంగా ఏటీఎంను ఎత్తుకెళ్లిన ఘటన కామారెడ్డి జిల్లా బిచ్కుందలో చోటుచేసుకుంది.

- 8లో ▸



అభివృద్ధికి కృషి..

అందరి సహకారంతో నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేస్తానని బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం పేర్కొన్నారు.

- 8లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం 31.9 /24.7

ఆకాశం మేఘావృతమవుతుంది. అడపా దడపా జల్లులు కురిసే అవకాశాలున్నాయి. అక్కడక్కడ ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురియవచ్చు.

న్యూస్‌రీల్

సీఎంను కలిసిన మినరల్ కార్పొరేషన్ చైర్మన్



ఖలీల్‌వాడి: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని రాష్ట్ర మినరల్ కార్పొరేషన్ చైర్మన్ ఈరవత్రి అనిల్ మంగళవారం హైదరాబాద్‌లోని సీఎం నివాసంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సీఎంకు పుష్ప గుచ్ఛం అందజేశారు. తనకు చైర్మన్ పదవి ఇవ్వడంపై కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు మానాల మోహన్ రెడ్డి, కాంగ్రెస్ నగరాధ్యక్షుడు కేశవేణు, కాంగ్రెస్ నేత తిప్పి రెడ్డి శ్రీనివాస్ తదితరులున్నారు.

12వ తేదీలోపు హాజరుకావాలి

నిజామాబాద్ అర్బన్: గిరిరాజ్ డిగ్రీ కళాశాలలో సీటు పొందిన విద్యార్థులు ఈ నెల 12వ తేదీలోపు అన్ని ధ్రువపత్రాలతో హాజరై తమ సీటును కన్‌ఫార్మ్ చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ రామ్మోహన్ రెడ్డి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. డిగ్రీ మొదటి సంవత్సరంలోని బీఏ, బీకాం, బీఎస్సీ, బీసీఏ, బీబీఏ, బీఎస్సీ కోర్సుల్లో సీటు పొందిన విద్యార్థులు గడువులోపు రావాలని సూచించారు.

కొనసాగుతున్న కౌన్సెలింగ్

నిజామాబాద్ అర్బన్: ఇంజినీరింగ్‌లో ప్రవేశాలకు సంబంధించిన కౌన్సెలింగ్ జిల్లా కేంద్రంలోని పాలిటెక్నిక్ కళాశాలలో మంగళవారం కొనసాగింది. ఇందులో 65 మంది విద్యార్థుల ధ్రువపత్రాల పరిశీలించారు. అనంతరం విద్యార్థులు వెబ్ ఆప్షన్లు పెట్టుకోవాల్సి ఉంటుంది. ఈనెల 13వ తేదీ లోపు ధ్రువపత్రాల పరిశీలన జరుగుతుందని కౌన్సెలింగ్ సమన్వయకర్త శ్రీరాంకుమార్ తెలిపారు. ఈనెల 15 తేదీలోపు వెబ్ ఆప్షన్లు పెట్టుకోవాలని పేర్కొన్నారు.

బీసీ సంక్షేమాధికారిణిగా స్రవంతి



నిజామాబాద్ అర్బన్: జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారిణిగా స్రవంతి మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఆమె గతంలో ఐసీడీఎస్ పీడీగా జిల్లాలో పనిచేశారు. అనంతరం బదిలీపై వెళ్లి హైదరాబాద్‌లోని సీసీఎల్‌లో పనిచేశారు. తాజాగా పదోన్నతిపై నిజామాబాద్‌కు బీసీ సంక్షేమ శాఖ అధికారిగా వచ్చారు.



గోదావరిలోకి వచ్చిన విషజలాలు

గోదావరిలోకి విషజలాలు

మహారాష్ట్రలోని లిక్కర్ ఫ్యాక్టరీ విడుదల చేసే విష వ్యర్థాలతో పవిత్ర గోదావరి జలాలు కలుషితమవుతున్నాయి. ఫలితంగా త్రివేణి సంగమం కందకుర్తి వద్ద భక్తులు స్నానాలు చేయడం మానేస్తున్నారు. మిషన్ భగీరథ పథకం ద్వారా నది నీటిని తాగుతున్న నిజామాబాద్, నిర్మల్ జిల్లాల్లోని 120 గ్రామాల ప్రజల ఆరోగ్యానికి ముప్పుగా మారింది. ట్రిపుల్ ఐటీ విద్యార్థులకూ ఈ నీరే సరఫరా అవుతోంది. ఈ నీటిని నేరుగా తాగుతున్న పశువులు మరణిస్తున్నాయి. భూసారం క్షీణించి నదీ తీర ప్రాంతంలో సాగు చేసే రైతులకు పంటల దిగుబడి తగ్గుతోంది. ఇంత జరుగుతున్నా కాలుష్య నియంత్రణ మండలి మాత్రం పట్టించుకోవడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

- త్రివేణి సంగమం వద్ద నదిలోకి మహారాష్ట్ర లిక్కర్ ఫ్యాక్టరీ వ్యర్థాలు
- వర్షాకాలంలో రాత్రి వేళ గుట్టు చప్పుడు కాకుండా విడుదల
- మిషన్ భగీరథ ద్వారా వివిధ గ్రామాలకు నది నీరు సరఫరా
- నీటిని వినియోగిస్తున్న ప్రజల ప్రాణాలకు ముప్పు
- పట్టించుకోని కాలుష్య నియంత్రణ మండలి

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: దక్షిణ గంగగా ప్రజలందరూ పవిత్రంగా భావించే గోదావరి నది కొందరి స్వార్థ ప్రయోజనాల కారణంగా విషపూరిత వ్యర్థాలతో అపవిత్రం అవుతోంది. నది నీటిని వినియోగించే తీర ప్రాంత ప్రజల ప్రాణాలకు ముప్పుగా మారింది. మహారాష్ట్రలో పుట్టిన గోదావరి నది జిల్లాలోని రెంజల్ మండలం కందకుర్తి వద్ద తెలంగాణలోకి ప్రవేశిస్తుంది. ఇక్కడే మంజీర, హరిద్ర నదులు గోదావరిలో కలుస్తున్నాయి. ఈ త్రివేణి సంగమంలో భక్తులు పవిత్ర స్నానాలు చేస్తుంటారు. సరిగ్గా ఇక్కడే గోదావరి అపవిత్రం కావడమే కాకుండా విషపూరితంగా మారుతోంది. దీంతో భక్తులు పవిత్ర స్నానాలు చేయడం మానేశారు.

■ గోదావరి నదికి సరిహద్దున సరిగ్గా 5 కిలోమీటర్ల దూరంలో ధర్మాబాద్ వద్ద పయనీర్ డిస్టిలరీస్ లిమిటెడ్ పేరిట లిక్కర్ ఫ్యాక్టరీ నడుస్తున్నది. ఈ ఫ్యాక్టరీలో విడుదలయ్యే విష జలాలను ఈటీపీ (వ్యర్థ జలాల శుద్ధి ప్రక్రియ ప్లాంట్)లో ప్రాసెస్ చేయకుండానే బాబ్లీ బ్యారేజ్ గేట్లు వదిలినప్పుడు సందట్లో సడేమియాలాగా పక్కనే ఉన్న పెదవాగు ద్వారా రాత్రి 10 గంటల నుంచి తెల్లవారుజాము 5 గంటల మధ్య ఫ్యాక్టరీ యాజమాన్యం గోదావరిలోకి వదులుతోంది. ఈటీపీలలో శుద్ధి చేయకుండానే చెరువుల్లో నిల్వ చేసిన విషజలాలను వరదల సమయంలో గోదావరిలోకి వదులుతున్నారు. దీంతో నిజామాబాద్, నిర్మల్ జిల్లాల్లోని 120 గ్రామాల ప్రజలు ఈ నీటిని మిషన్ భగీరథ పథకం ద్వారా తాగుతూ వ్యాధుల బారిన పడుతున్నారు. మరోవైపు పశువులు ఈ నీరు నేరుగా తాగి మరణిస్తున్నాయి. ఐఐఐటీ బాసర విద్యార్థులు సైతం ఈ నీరే తాగుతున్నారు. ఆరు వేల మంది విద్యార్థులు చదువుతున్న ఐఐఐటీ నిర్వాహకులు 2017లో ఫిర్యాదు చేయడంతో సదరు ఫ్యాక్టరీ వాళ్లు ఆ ఏడాది విషపు నీటిని చెరువులో నింపి మట్టితో కప్పేశారు. మరుసటి ఏడాది నుంచి మళ్లీ మొదటికి వచ్చి గోదావరిలోకే వదులుతున్నారు.

ఇదిలా ఉండగా ఆరేళ్ల క్రితం శ్రీరాంసాగర్ జలాశయంలోకి వచ్చిన విషజలాలతో వందల క్వింటాళ్ల చేపలు చనిపోయాయి. విషయాన్ని బయటకు పొక్కనీయలేదు. ఇప్పటికీ పశువులు, వన్యప్రాణులు ఈ నీటితో మృత్యువాత పడుతున్నాయి. ఈ విషయమై నాందేడ్, నిజామాబాద్, ఔరంగాబాద్, ముంబై, హైదరాబాద్‌లలో కాలుష్య నియంత్రణ మండలి అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ ఫలితం లేదని చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలు వాపోతున్నారు.



ఎరుపు రంగులోకి మారిన నీరు

“ గ్రీన్ ట్రిబ్యునల్‌కు వెళతాం..



పవిత్ర గోదావరిని అపవిత్రం చేస్తున్నారు. ఈ విషయమై ముంబై, హైదరాబాద్, నిజామాబాద్, నాందేడ్, ఔరంగాబాద్‌లలో అధికారులకు అనేక సార్లు ఫిర్యాదులు చేశాం. అధికారులు సైతం అంతా బాగానే ఉందని చెబుతూ మాకు అన్యాయం చేస్తున్నారు. ఎంత మొత్తుకున్నప్పటికీ మా ఆవేదన అరణ్యరోదనే అవుతోంది. ఇక గ్రీన్ ట్రిబ్యునల్‌కు వెళ్లేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నాం. ప్రధానమంత్రి, రాష్ట్రపతికి సైతం ఫిర్యాదు చేస్తాం.

– హనుమాండ్లు, రైతు, రెంజల్

పంట దిగుబడులూ విషపూరితమే..

మొలాసిస్ ఈస్ట్, బాక్టీరియా, వ్యర్థాలను పులియబెట్టి తద్వారా ఇథనాల్ తయారు చేస్తున్నారు. ఈ క్రమంలో వచ్చిన విషపూరిత నీటిని సుమారు 25 చెరువుల్లో నిల్వ చేస్తున్నారు. ఈ నీటితో కూడిన చెరువులను మట్టితో కప్పేయాలి. బయటకు వదలాలంటే ఈటీపీ ద్వారా శుద్ధి చేసి వదలాలి. ఇవేవీ చేయకుండానే వర్షాకాలంలో రాత్రి సమయాల్లో ఇష్టం వచ్చినట్లు విషపు నీటిని వదులుతున్నారు. ఇక ఈ నీటి కారణంగా చుట్టుపక్కల ప్రాంతాల్లో పంటల దిగుబడులు సైతం విషతుల్యంగానే ఉంటున్నాయి. భూసారం పూర్తిగా దెబ్బతింటోంది. తెట్టులా పేరుకుపోయిన రసాయనాలు నేరుగా గోదావరిలోకి వస్తున్నాయి.



మహారాష్ట్రలోని లిక్కర్ ఫ్యాక్టరీ శాటిలైట్ మ్యాప్

పనులను వేగంగా పూర్తిచేయాలి



నందిపేట రాజనగర్ పాఠశాలలో తొలగించిన కిటికీ తలుపులను పరిశీలిస్తున్న కలెక్టర్

- కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు
- పాఠశాలల్లో మౌలిక వసతుల పనుల పరిశీలన

నందిపేట్ (ఆర్మూర్): అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ఆధ్వర్యంలో ఆయా ప్రభుత్వ బడుల్లో కొనసాగుతున్న పనులను వేగంగా పూర్తి చేయాలని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు అధికారులను ఆదేశించారు. నందిపేట్ మండలం రాజనగర్‌లోని ప్రాథమిక పాఠశాలను, నర్సరీని మంగళవారం సందర్శించారు. పాఠశాలల్లో వంట గది, వరండా, అదనపు గదులు, వాటర్ సంప్, టాయిలెట్ల నిర్మాణం, మరమ్మతులను పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు. ఇప్పటికే చాలావరకు పాఠశాలల్లో పనులు పూర్తయ్యాయని, ఇంకా పలు స్కూళ్లలో వివిధ దశల్లో కొనసాగుతున్న పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తిచేయించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. అవసరమైన పనులను మాత్రమే చేపట్టాలని, నాణ్యతా ప్రమాణాలు పాటించేలా పకడ్బందీ పర్యవేక్షణ జరపాలని సూచించారు. వర్షాకాలం సీజన్ కావడంతో పాఠశాలల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. నర్సరీలో మొక్కలు పెంచుతున్న తీరును పరిశీలించారు. వన మహోత్సవంలో భాగంగా విరివిగా మొక్కలు నాటి పూర్తిస్థాయిలో లక్ష్యాన్ని సాధించాలని అధికారులకు సూచించారు. కలెక్టర్ వెంట నందిపేట్ ప్రత్యేకాధికారి జగన్నాథ చారి, పంచాయతీరాజ్ ఈఈ భావన్న, ఎంపీడీవో శ్రీనివాసరావు, తహసీల్దార్ ఆనంద్ కుమార్, ఎంపీవో కిరణ్, మండల విద్యాధికారి శ్రీనివాస్ రెడ్డి, ఐకేపీ ఈజీఎస్ అధికారులు, పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.

త్వరితగతిన చేపట్టాలి

మాక్లూర్: పెండింగ్‌లో ఉన్న అమ్మ ఆదర్శ పాఠశాల పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు అధికారులను ఆదేశించారు. ముల్లంగి(బి), బొంకన్‌పల్లి పాఠశాలల్లో కొనసాగుతున్న పనులను పరిశీలించారు. పనులు పూర్తి చేయడంలో ఇప్పటికే ఆలస్యమైందన్నారు. నిర్లక్ష్యం వీడి పనులను పూర్తి చేయించాలని సూచించారు. వన మహోత్సవంలో భాగంగా బడి ఆవరణలో కలెక్టర్ మొక్కలను నాటారు. కలెక్టర్ వెంట ఎంపీడీవో క్రాంతి, ప్రత్యేకాధికారి ముత్తెన్న, తహసీల్దార్ మహమ్మద్ షబ్బీర్, పంచాయతీ రాజ్ ఈఈ భావన్న, ఏఈ శ్రీనివాస్, ఐకేపీ ఏపీఎం అనిల్ కుమార్ పాల్గొన్నారు.

వనమహోత్సవానికి ప్రాధాన్యతివ్వాలి

- పారిశుధ్యంపై ప్రజలకు అవగాహన కల్పించాలి
- ఎరువుల కృత్రిమ కొరత లేకుండా చూడాలి
- వీసీలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్, అదనపు కలెక్టర్లు

సుభాష్‌నగర్: పర్యావరణాన్ని పరిరక్షిస్తూ, పచ్చదనం పెంపొందించేందుకు వీలుగా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న వనమహోత్సవ కార్యక్రమానికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి సూచించారు. వనమహోత్సవం, ప్రజాపాలన సహాయ కేంద్రాలు, మహిళా శక్తి, సీజనల్ వ్యాధులు, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ఆధ్వర్యంలో చేపడుతున్న పనులతో పాటు, ధరణి దరఖాస్తులు, ఏకరూప దుస్తులు, పాఠ్య పుస్తకాల పంపిణీ, ఉద్యోగుల సాధారణ బదిలీల అంశాలపై మంగళవారం సాయంత్రం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్లతో సీఎస్ సమీక్ష నిర్వహించారు. వర్షాలు ఆలస్యమైనా.. ప్రస్తుతం విస్తారంగా కురుస్తున్నందున పెద్దఎత్తున మొక్కలు నాటేందుకు ఎంతో అనుకూల సమయమని పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 20 కోట్లకుపైగా మొక్కలు నాటాలని లక్ష్యంగా పెట్టుకున్నామని, ఆగస్టు నెలాఖరు నాటికి నూరుశాతం మొక్కలు నాటేలా పకడ్బందీ కార్యాచరణ అమలు చేయాలన్నారు. గ్రామాలను దత్తత తీసుకుని, పచ్చదనం ద్వారా వివిధ వర్గాల వారిలో స్ఫూర్తిని పెంపొందించాలని కలెక్టర్లకు సూచించారు.

మహిళా సాధికారతే ప్రభుత్వ లక్ష్యం

మహిళా సాధికారతే లక్ష్యంగా ప్రభుత్వం అమలు చేస్తున్న మహిళా శక్తి కార్యక్రమాన్ని అన్ని జిల్లాల్లో విజయవంతం చేయాలని సీఎస్ సూచించారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఏకరూప దుస్తులు కుట్టే బాధ్యతలను కూడా మహిళా స్వయం సహాయక సంఘాలకు అందించామని గుర్తుచేశారు. మహిళలు డెయిరీ, పౌల్ట్రీఫాం, క్యాంటీన్ వంటి యూనిట్లు స్థాపించేందుకు, చిన్న తరహా పరిశ్రమలు, స్థానిక పరిస్థితులకు అనువుగా ఉండే వ్యాపారాలు ఏర్పాటు చేసుకునేందుకు వీలుగా ప్రభుత్వపరంగా తోడ్పాటు అందించాలన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని, సంక్షేమ హాస్టళ్లు, పాఠశాలల్లో పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలని సీఎస్ శాంతి కుమారి తెలిపారు. డెంగీ, మలేరియా, అతిసారా, విషజ్వరాలు వంటి వ్యాధులపై అవగాహన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. జిల్లాలో ఎరువుల కృత్రిమ కొరత లేకుండా చూడాలని, రైతు భరోసా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ద్వారా చేపట్టిన పనులు వెంటనే పూర్తి చేసేలా కలెక్టర్లు చర్యలు చేపట్టాలన్నారు. టీచర్ల బదిలీలు విజయవంతంగా చేసిన విధంగానే, ఉద్యోగుల సాధారణ బదిలీలను కూడా ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా ఈనెల 20వ తేదీలోగా ప్రక్రియను పూర్తి చేయాలని సీఎస్ సూచించారు. కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు, అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్ కుమార్, మున్సిపల్ కమిషనర్ మకరంద్, జెడ్పీ సీఈవో ఉష, డీఆర్డీవో సాయాగౌడ్, డీపీవో తరుణ్ కుమార్, డీఎంహెచ్‌వో తుకారాం రాథోడ్, సీపీవో మల్లికార్జున్, మెప్మా పీడీ రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

ఏబీవీపీ ఎన్నో ఉద్యమాలు చేసింది

- ఏబీవీపీ సహ సంఘటన కార్యదర్శి బాలకృష్ణ



నగరంలో మహార్యాలీ నిర్వహిస్తున్న ఏబీవీపీ కార్యకర్తలు



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న సహ సంఘటన కార్యదర్శి బాలకృష్ణ

నిజామాబాద్‌అర్బన్: దేశం కోసం ఏబీవీపీ ఎన్నో ఉద్యమాలు చేసిందని అఖిల భారత సహ సంఘటన కార్యదర్శి బాలకృష్ణ అన్నారు. జాతీయ విద్యార్థి దినోత్సవం సందర్భంగా అఖిల భారతీయ విద్యార్థి పరిషత్(ఏబీవీపీ) ఇందూరు శాఖ ఆధ్వర్యంలో మంగళవారం నగరంలో మహా ర్యాలీ నిర్వహించారు. అనంతరం రాజీవ్ గాంధీ ఆడిటోరియంలో సభలో ఆయన మాట్లాడారు. ఏబీవీపీలో పనిచేయడం వల్ల విద్యార్థి దశలోనే నాయకత్వ లక్షణాలు, దేశభక్తి అలవడుతాయని తెలిపారు. విద్యార్థుల సమస్యలు, నిరుద్యోగుల సమస్యల పరిష్కారం కోసం కోసం గల్లీ నుంచి ఢిల్లీ వరకు పోరాటాలు చేస్తోందని వివరించారు. కాశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు దేశం నలుమూలల విస్తరిస్తూ ప్రపంచంలోనే అతిపెద్దగా విద్యార్థి సంస్థగా నిలిచిందని వెల్లడించారు. ప్రత్యేక తెలంగాణ కోసం ఎన్నో పోరాటాలు చేసిందని గుర్తుచేశారు. నిరంతరం నేషన్ ఫస్ట్ ఫిలాసఫీతో విద్యార్థులలో జాతీయ భావాన్ని పెంపొందిస్తూ పని చేస్తుందన్నారు. కార్యక్రమంలో ఏబీవీపీ పూర్వ రాష్ట్ర అధ్యక్షుడు నరేశ్, విభాగ్ సంఘటన మంత్రి రాజు సాగర్, జాతీయ కార్యవర్గ సభ్యుడు శివ, విభాగ్ కన్వీనర్ శశిధర్, జిల్లా కన్వీనర్ సునీల్, వ్యవస్థ ప్రముఖ్ సురేందర్ రెడ్డి, నగరాధ్యక్షుడు గొడుగు వెంకటకృష్ణ, పూర్వ కార్యకర్తలు స్వామి యాదవ్, జగన్మోహన్ గౌడ్, రాజ్ గణేశ్, రాకేశ్, నవీన్, జగదీష్, దుర్గాదాస్, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

తెయూలో క్యాంపస్ ప్లేస్‌మెంట్ డ్రైవ్



తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ, తెలంగాణ అకాడమీ ఆఫ్ స్కిల్ అండ్ నాలెడ్జ్ సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో డీఎస్ టెక్నాలజీస్ కంపెనీ ఉద్యోగాల భర్తీ కోసం సోమవారం క్యాంపస్ ప్లేస్‌మెంట్ డ్రైవ్(జాబ్ మేళా)ను నిర్వహించింది. యూనివర్సిటీలో నిర్వహించిన డ్రైవ్‌లో ఎనిమిది మంది విద్యార్థులను కంపెనీ ప్రతినిధులు ఎంపిక చేసినట్లు వర్సిటీ ప్లేస్‌మెంట్ డైరెక్టర్ పాత నాగరాజు తెలిపారు. భవిష్యత్‌లో మరిన్ని కంపెనీలు యూనివర్సిటీకి రానున్నాయని, విద్యార్థులు ఇంటర్వ్యూలకు సిద్ధం కావాలని ఆయన పేర్కొన్నారు. ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులను రిజిస్ట్రార్ ఎం యాదగిరి, ప్రిన్సిపాల్ సీహెచ్ ఆరతి అభినందించారు. కార్యక్రమంలో డీఎస్ టెక్నాలజీస్ మేనేజర్ రాజేశ్, అసిస్టెంట్ మేనేజర్ యూ సత్యనారాయణ, హెచ్‌ఆర్ వర్షిణి, టీం లీడర్ గఫార్,వర్సిటీ అధ్యాపకులు రాంబాబు,శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఫీజు చెల్లింపునకు ఈనెల 15 వరకు గడువు

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ పరిధిలో 2020–21 విద్యాసంవత్సరం పీజీ ఎంబీఏ, ఎంసీఏ రెండో సెమిస్టర్, ఐఎంబీఏ 8వ సెమిస్టర్ బ్యాక్‌లాగ్ పరీక్షల ఫీజు చెల్లింపునకు ఈ నెల 15వ తేదీ తుది గడువని కంట్రోలర్ ఎం.అరుణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రూ.100 అపరాధ రుసుముతో ఈ నెల 19వ తేదీ వరకు పరీక్ష ఫీజు చెల్లించే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు తెలంగాణ యూనివర్సిటీ వెబ్‌సైట్ www. telanganauniversity. ac. in ను సంప్రదించాలని ఆమె సూచించారు.

19న అరుణాచలానికి ప్రత్యేక బస్సులు

ఖలీల్‌వాడి: గురుపౌర్ణమి సందర్భంగా అరుణాచలంలో నిర్వహించే గిరి ప్రదక్షిణకు ఈ నెల 19న ఆర్టీసీ బస్టాండ్‌లో ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేసినట్లు ఆర్‌ఎం జానీరెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 21న అరుణాచలంలో గిరి ప్రదక్షిణ ఉంటుందని భక్తుల సౌకర్యార్థం ఈ సౌకర్యాన్ని ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. 19న రాత్రి 8 గంటలకు బస్టాండ్ నుంచి బస్సులు బయలుదేరుతాయని 20న కాణిపాకం, వేలూరు గోల్డెన్ టెంపుల్‌లను దర్శించుకొని అరుణాచలం చేరుకుంటారన్నారు. తిరిగి 21న అరుణాచలం నుంచి బయలుదేరి 22న ఉదయం జోగులాంబ ఆలయాన్ని దర్శించుకొని జిల్లాకు చేరుకుంటారన్నారు. టికెట్ ధర పెద్దలకు రూ.4200, పిల్లలకు రూ.3400 ఉంటుందన్నారు. ఉమ్మడి నిజామాబాద్ జిల్లా ప్రయాణికులు, భక్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నిఖితకు స్టేట్ ఫస్ట్ ర్యాంక్



వై నిఖిత

నిజామాబాద్ అర్బన్: జూనియర్ లెక్చరర్ పోటీపరీక్షలో జిల్లా కేంద్రానికి చెందిన వై. నిఖిత స్టేట్ ఫస్ట్ ర్యాంక్ సాధించింది. ఈ పరీక్షలో తన కుమార్తె 386 మార్కులకు గాను 301 మార్కులు సాధించినట్లు ఆమె తండ్రి భూమేశ్వర్ పేర్కొన్నారు. నిఖితకు స్టేట్ ఫస్ట్ ర్యాంక్ రావడంపై కుటుంబీకులు, కాలనీ వాసులు హర్షం వ్యక్తం చేశారు.

రోగులకు బాసటగా టీ హబ్

- ఉచితంగా 43 రకాల రక్త పరీక్షలు
- పేదలకు తప్పిన ఆర్థిక భారం



బ్లడ్ శాంపిల్‌ను సేకరిస్తున్న ల్యాబ్ అసిస్టెంట్



వేల్పూర్: తెలంగాణ (టీ) హబ్ పేద, మధ్య తరగతి కుటుంబాల్లోని రోగులకు బాసటగా నిలుస్తోంది. ప్రైవేట్ పాథాలాజికల్ ల్యాబ్‌లలో వేలాది రూపాయల వ్యయంతో అయ్యే టెస్టులు రోగులకు ఇక్కడ ఉచితంగా అవుతున్నాయి. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ప్రతిరోజూ ఉదయం రోగుల నుంచి రక్త నమూనాలు సేకరించి వాటికి బార్‌కోడ్ ఏర్పాటు చేసి ఆన్‌లైన్‌లో రోగుల వివరాలను నమోదు చేస్తారు. ఈ విధంగా 11 గంటలలోపు రోగుల ఇచ్చిన రక్త నమూనాలను ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వాహనంలో జిల్లా కేంద్రంలోని 'టీ హబ్' ల్యాబ్‌కు తరలిస్తారు. అక్కడ పరీక్షించిన రక్తనమూనాల ఫలితాలను అదేరోజు రాత్రి 12 గంటల తర్వాత రోగుల ఫోన్‌కు మెస్సెజ్ పంపిస్తారు. దాని ద్వారా అవసరమైన చికిత్సను వైద్యుల దగ్గరికి వెళ్లి చేయించుకోవచ్చు. 2020లో అప్పటి రాష్ట్ర ప్రభుత్వం టీ హబ్‌ను ఏర్పాటు చేసింది. దీంట్లో బయోకెమిస్ట్రీ టెస్టుల్లో భాగంగా డయాబెటిక్ ప్రొఫైల్, లివర్ ఫంక్షన్ టెస్టులు, రక్తంలో యూరియా, సిరమ్ క్రియాటినన్, సిరమ్ యూరిక్ యాసిడ్, లిపిడ్ ప్రొఫైల్ టెస్టుల్లో భాగమైన శరీరంలో మొత్తం కొవ్వుశాతం, ట్రైగ్లిజరాయిడ్స్, ఎల్‌డీఎల్, హెచ్‌డీఎల్ రేషియో, పాథాలజి టెస్టుల్లో భాగంగా హిమోగ్లోబిన్, వైట్ బ్లడ్ సెల్స్, మైక్రోబయాలజీ టెస్టులు ఉచితంగా చేస్తున్నారు. కిడ్నీ, కాలేయం పనితీరు, టైఫాయిడ్, డెంగీ నిర్ధారణ పరీక్షలు, థైరాయిడ్, నరాల బలహీనత తదితర టెస్టులను ఉచితంగా చేస్తున్నారు. వేల్పూర్‌లో మూడున్నర సంవత్సరాలుగా ఏడాదికి సుమారు 1500 నుంచి 1800 మంది ఉచితంగా సేవలు పొందుతున్నారు. ప్రైవేట్ ల్యాబ్‌లలో వేలాది రూపాయల విలువచేసే డయాగ్నోస్టిక్ పరీక్షలు జిల్లా కేంద్ర ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన టి హబ్‌లో ఉచితంగా లభిస్తుండడం గ్రామీణ ప్రాంత ప్రజలకు వరంగా మారింది.

సద్వినియోగం చేసుకోవాలి



టీ హబ్ ద్వారా అందుతున్న సేవలను అవసరమైన వారు సద్వినియోగం చేసుకోవాలి. పేదలపై ఆర్థికభారం తగ్గుతోంది.మండల ప్రజలు మూడున్నరేళ్లుగా ఉచిత సేవలను వినియోగించుకుంటున్నారు. అనారోగ్యానికి గురైన వారు స్థానికంగానే ఉచితంగా టెస్టులు చేసుకోవచ్చు.

– వీణ, మెడికల్ ఆఫీసర్, పీహెచ్‌సీ, వేల్పూర్

చాలా సౌకర్యంగా ఉంది



డయాగ్నోస్టిక్ టెస్టు కోసం పట్టణ ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండాపోయింది. స్థానికంగానే ఉచితంగా సేవలు అందిస్తుండడం చాలా సౌకర్యంగా ఉంది. ప్రైవేట్ ల్యాబ్‌లకు వెళ్తే ఏ చిన్న టెస్టు చేసినా కనీసం రూ.500 అవుతుంది.

– గడ్డం హన్మంతు, వెంకటాపూర్

వ్యాపారంలో మెలకువలు తెలుసుకోవాలి



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఐకేపీ డీపీఎం

డిచ్‌పల్లి: వ్యాపారంలో మెళకువలు తెలుసుకుంటే ఆర్థికంగా అభివృద్ధి సాధించవచ్చని ఐకేపీ డీపీఎం సాయిలు సూచించారు. మండల కేంద్రంలోని ఎస్బీఐ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన ఈడీపీ(ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం) కార్యక్రమానికి డీపీఎం హాజరై మాట్లాడారు. ఇలాంటి శిక్షణ కార్యక్రమాలు వ్యాపారం అభివృద్ధి చెందడానికి ఉపయోగపడతాయన్నారు. ఇంట్లో ఉంటూనే స్వయం ఉపాధితో వ్యాపారం చేసుకునే అవకాశం ఉంటుందన్నారు. ఈ సంస్థలో శిక్షణ పొందిన ఎంతో మంది మహిళలు జీవితంలో స్థిరపడ్డారని పేర్కొన్నారు. మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. సంస్థ డైరెక్టర్ సుంకం శ్రీనివాస్, సిబ్బంది భాగ్యలక్ష్మి, రామకృష్ణ, నవీన్, రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

నీటి నమూనాల సేకరణ



రెంజల్: రెంజల్, తాడ్‌బిలోలి, వీరన్నగుట్ట గ్రామాల్లో మంగళవారం జల్ జీవన్ మిషన్ కేంద్ర ప్రభుత్వ బృందం సభ్యుడు పర్యటించి నీటి నమూనాలను సేకరించారు. ప్రభుత్వ పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాలు, గ్రామస్తులకు తాగునీరు అందించే నల్లాల నీటిని సేకరించి పరిశీలించారు. విద్యార్థులు సురక్షితమైన నీటిని సేవించాలనే సంకల్పంతో కేంద్ర ప్రభుత్వం నీటి నమూనాలను సేకరించి స్వచ్ఛమైన తాగు నీటిని అందించేందుకు ప్రయత్నిస్తున్నట్లు ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ మున్నినాయక్ తెలిపారు. కేంద్ర బృందం ప్రతినిధితో పాటు ఎంపీడీవో శ్రీనివాస్, ఏఈలు గబ్బర్‌సింగ్, చంద్రకాంత్, ల్యాబ్ టెక్నీషియన్ లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

ఏటీఎంనే ఎత్తుకెళ్లారు

- రూ. 3.95 లక్షలు చోరీ
- మహారాష్ట్ర వైపు పరారైన దొంగలు
- చోరీకి వినియోగించిన క్వాలిస్ వాహనం గుర్తింపు



ఏటీఎం గదిని పరిశీలిస్తున్న డీఎస్పీ సత్యనారాయణ

నిజాంసాగర్(జుక్కల్): ఏకంగా ఏటీఎం నే ఎత్తుకెళ్లిన చోరీ ఘటన కామారెడ్డి జిల్లా బిచ్కుంద మండల కేంద్రంలో మంగళవారం తెల్లవారుజామున 3.20 గంటల ప్రాంతంలో చోటు చేసుకుంది. బిచ్కుంద మండల కేంద్రంలోని బస్టాండ్ సమీపంలో ఉన్న ఎస్బీఐ ఎటీఎంకు గుర్తుతెలియని ఆరుగురు దొంగలు క్వాలిస్ వాహనంలో వచ్చారు. నలుగురు ఏటీఎం రూమ్ వద్దకు వెళ్లి ఏటీఎంను పెకిలించి బయటకు తీసుకొచ్చారు.

అందరు కలిసి క్వాలిస్ వాహనంలో ఏటీఎం చేర్చారు. ఏటీఎం చోరీకి పాల్పడుతున్న సమయంలో గుర్తు తెలియని వ్యక్తి పోలీసులకు సమాచారం అందించగా, పెట్రోలింగ్‌లో ఉన్న బిచ్కుంద పోలీసులు హుటాహుటిన ఘటన స్థలానికి చేరుకున్నారు. అయితే అప్పటికే ఏటీఎంతో సహా దొంగలు వాహనంలో పరారయ్యారు. దొంగలు జుక్కల్ చౌరస్తా, బాలాజీ నగర్, ఖండెబల్లూర్, పెద్ద ఎడ్గి, గుల్లా మీదుగా మహారాష్ట్ర వైపు వెళ్లినట్లు వారి వాహనం సీసీ కెమెరాల్లో రికార్డు అయ్యింది. పెద్ద ఎడ్గి గ్రామంలో రెండు బైక్‌లను సైతం దొంగలు దొంగిలించి తీసుకుపోయారు. ఏటీఎం దొంగతనానికి ఉపయోగించిన క్వాలీస్ వాహనాన్ని మహారాష్ట్ర సరిహద్దులోని బీంరా తండా వద్ద వదిలి వెళ్లారు. అక్కడి నుంచి మరో వాహనంలో పరారయినట్లు తెలుస్తోంది. సమాచారం అందుకున్న బ్యాంకు మేనేజర్ మోహన్‌రావు ఏటీఎం కేంద్రానికి చేరుకున్నారు. ఏటీఎంలో రూ. 3.95 లక్షలు ఉన్నట్లు మేనేజర్ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నట్లు బిచ్కుంద ఎస్సై మోహన్ రెడ్డి తెలిపారు. బాన్సువాడ డీఎస్పీ సత్యనారాయణ ఘటన స్థలాన్ని పరిశీలించారు. ఏటీఎం చోరీకి సంబంధించి సీసీ టీవీలో రికార్డు కావడంతో పోలీసులు విచారణ చేపట్టారు.

పాఠశాల విద్యార్థికి కరెంట్ షాక్



నిజామాబాద్‌అర్బన్: నగరంలోని సారంగాపూర్ ప్రభుత్వ పాఠశాలలో మంగళవారం విద్యుత్‌షాక్‌తో విద్యార్థినికి గాయాలయ్యాయి. పాఠశాల ఆవరణలో ప్రమాదకరంగా వేలాడుతున్న విద్యుత్‌వైర్లకు ఎనిమిదో తరగతి చదువుతున్న విద్యార్థిని సులోచన చేయి తగలడంతో గాయాలయ్యాయి. ఆమెను వెంటనే ఉపాధ్యాయులు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. బాధిత విద్యార్థినికి మెరుగైన వైద్యం అందించాలని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ ప్రభుత్వ ఆస్పత్రి అధికారులను ఆదేశించారు.

పర్యవేక్షణ కరువు

పాఠశాలలో అమ్మ ఆదర్శ కమిటీ ద్వారా పనులు జరుగుతుండగా విద్యుత్ వైర్లు ఎక్కడికక్కడే వేలాడుతున్నాయి. సరైన పర్యవేక్షణ లేకపోవడంతోపాటు విద్యుత్ వైర్లు వేలాడుతున్నా పట్టించుకునే వారు కరువయ్యారు. నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఉపాధ్యాయులపై జిల్లా విద్యాశాఖ ఉన్నతాధికారులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

సమన్వయంతో అభివృద్ధికి కృషి



వర్నిలో కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీచేస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్‌రెడ్డి

వర్ని: నియోజకవర్గంలో అందరినీ కలుపుకొని సమన్వయంతో అభివృద్ధికి కృషి చేస్తానని బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. వర్ని మండల కేంద్రంలో మంగళవారం రుద్రూర్, మోస్రా, చందూర్, వర్ని మండలాలకు చెందిన 106 మంది లబ్ధిదారులకు రూ.కోటీ ఐదు లక్షల విలువైన చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. పేదింటి ఆడబిడ్డల పెళ్లి భారం కావొద్దనే ఉద్దేశంతో కల్యాణలక్ష్మి పథకం ద్వారా ఆర్థిక సహాయం అందిస్తున్నామన్నారు. నియోజకవర్గంలో ఇదివరకు చేపట్టిన అభివృద్ధితోపాటు మిగిలిపోయిన పనులన్నింటినీ పూర్తి చేస్తానని పేర్కొన్నారు. తెలంగాణలోని అభివృద్ధి చెందిన పది నియోజకవర్గాల్లో బాన్సువాడ ఒకటని, మరింత అభివృద్ధికి నిర్విరామ కృషి చేస్తానన్నారు. బోధన్ ఆర్డీవో అంబదాస్ రాజేశ్వర్, వర్ని మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సురేశ్‌బాబా, చందూర్ మాజీ జెడ్పీటీసీ అంబర్‌సింగ్, వర్ని సొసైటీ మాజీ అధ్యక్షుడు వీర్రాజు, పీసీసీ డెలిగేట్ కూనిపూర్ రాజిరెడ్డి, సొసైటీ చైర్మన్ సాయిబాబా, వర్ని మాజీ జెడ్పీటీసీ రంజ్యా నాయక్, నాయకులు పిట్ల శ్రీరాములు, హనుమంతరెడ్డి, లక్ష్మణ్, శ్రీను, గిరి, ప్రశాంత్ పాల్గొన్నారు

విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలి

ప్రభుత్వ హాస్టళ్లలో విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి సూచించారు. మండలంలోని కోటయ్య క్యాంపులో ఎస్సీ బాలికల వసతి గృహంతోపాటు కేజీబీవీ ఆవరణలో అదనపు గదుల స్థలాన్ని పరిశీలించారు. విద్యార్థులకు అందించే భోజనం, సౌకర్యాల కల్పనలో ఎక్కడైనా పొరపాట్లు జరిగితే శాఖాపరమైన చర్యలకు వెనుకాడబోమని స్పష్టం చేశారు. ఎమ్మెల్యే వెంట వర్ని సొసైటీ చైర్మన్, మార్కెట్ కమిటీ మాజీ ఉపాధ్యక్షులు గోపాల్, వీర్రాజు, రాజిరెడ్డి, బారీ, కరీం, సాయిబాబా, గిరి, ప్రశాంత్ ఉన్నారు.

తాత, మనవరాలికి పాముకాటు

- బాలిక మృతి
- చికిత్స పొందుతున్న తాత



జోడు వైష్ణవి(ఫైల్)

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): రేకులషెడ్డులో నిద్రిస్తున్న తాత, మనవరాలిని కట్లపాము కరిచిన ఘటనలో మనవరాలు మృతిచెందగా తాత ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. నాగిరెడ్డిపేట మండలంలోని జాప్తిజాన్కంపల్లిలో మంగళవారం తెల్లవారుజామున చోటు చేసుకున్న సంఘటన వివరాలిలా ఉన్నాయి. జాప్తిజాన్కంపల్లి గ్రామానికి చెందిన జోడు సంగమేశ్వర్ రెండో కూతురు వైష్ణవి(7), తన తాత జోడు శంకరయ్య(60)తో కలిసి సోమవారం రాత్రి రేకులషెడ్డులో నిద్రించింది. అర్ధరాత్రి దాటాక వైష్ణవితోపాటు శంకరయ్యను పాము కరిచింది. నిద్రలేచిన వారు లైటువేసి గమనించగా పాము కనిపించడంతో దాన్ని కుటుంబ సభ్యుల సహాయంతో కొట్టిచంపారు. అనంతరం పాముకాటుకు గురైన వైష్ణవి, శంకరయ్యలను ఎల్లారెడ్డి ఆస్పత్రికి తరలించారు. అక్కడి వైద్యుల సూచనల మేరకు మెరుగైన వైద్యం కోసం కామారెడ్డి ఆస్పత్రికి తరలిస్తుండగా వైష్ణవి మృతిచెందింది. శంకరయ్యను సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేటలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. వైష్ణవి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై రాజు తెలిపారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం

ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి) : ఎల్లారెడ్డి మున్సిపాలిటీ పరిధిలోని బాలాజీ నగర్‌తండాలో పాముకాటుతో మృతి చెందిన కమల కుటుంబానికి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు మంగళవారం ఆర్థికసాయం అందించారు. పాముకాటుతో మృతి చెందిన కమల కుటుంబ సభ్యులను పరామర్శించారు. కమల కుటుంబానికి ప్రభుత్వం నుంచి అన్నివిధాలా ఆదుకుంటామన్నారు.

వేర్వేరు ఘటనల్లో ఇద్దరి మృతి



గంగాధర్ (ఫైల్)

మోర్తాడ్(బాల్కొండ): ట్రాక్టర్‌ను దాటేక్రమంగా మరో వాహనాన్ని తప్పించబోయి బైక్ అదుపుతప్పిన ఘటనలో మహిళ మృతి చెందింది. ఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి.. కమ్మర్‌పల్లి మండలం బషీరాబాద్‌కు చెందిన భార్యాభర్తలు ఆకుల లింగన్న, ఆకుల లక్ష్మి తమ కూతురిని హైదరాబాద్ వెళ్లేందుకు మంగళవారం ఆర్మూర్‌లో బస్సు ఎక్కించారు. తిరిగి ఇంటికి వస్తుండగా దొన్కల్ క్రాస్‌రోడ్డు వద్ద ప్రమాదం చోటు చేసుకుంది. ఈ ఘటనలో లక్ష్మి (40) మృతి చెందింది. ఉన్నత చదువుల కోసం పంపించిన కూతురు హైదరాబాద్‌కు చేరకముందే తల్లి రోడ్డు ప్రమాదంలో మరణించడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై అనిల్‌రెడ్డి తెలిపారు.

డ్రెయినేజీలో పడి కార్మికుడు..

బాన్సువాడ : డ్రెయినేజీలో పడి మున్సిపల్ కార్మికుడు మృతి చెందిన ఘటన పట్టణంలోని తాడ్కోల్ రోడ్డులో చోటు చేసుకుంది. మున్సిపాలిటీ కార్మికుడు గంగాధర్(39) సోమవారం రాత్రి అతిగా మద్యం సేవించి కల్వర్టుపైనే పడుకున్నాడు. అర్ధరాత్రి నిద్రలో ఉన్న అతడు డ్రెయినేజీలో పడి ఊపిరాడక మృతి చెందాడు. మంగళవారం ఉదయం గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ కృష్ణ తెలిపారు.

రెండు వాహనాలు ఢీ.. ఒకరికి తీవ్రగాయాలు

నిజామాబాద్‌రూరల్: రెండు వాహనాలు ఢీకొన్న ఘటనలో ఒకరికి తీవ్రగాయాలైనట్లు రూరల్ పోలీస్‌స్టేషన్ ఎస్‌హెచ్‌వో మహేశ్ తెలిపారు. విద్యుత్‌శాఖలో పని చేస్తున్న తిరుపతి సోమవారం రాత్రి మానిక్‌బండార్ నుంచి కంఠేశ్వర్ వైపు ద్విచక్రవాహనంపై వస్తుండగా, గుపన్‌పల్లి వద్ద జోహార్‌పాషా అనే వ్యక్తి బైక్‌పై అతివేగంగా వచ్చాడు. రెండు వాహనాలు ఢీకొనడంతో తిరుపతికి తీవ్రగాయాలయ్యాయి. బాధితుడి తమ్ముడు గోపి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు.

రూ.43 లక్షల విలువైన గుట్కా పట్టివేత

డిచ్‌పల్లి, జిల్లా కేంద్రంలో సీజ్



వ్యాన్ డ్రైవర్‌ను విచారిస్తున్న డిచ్‌పల్లి పోలీసులు

డిచ్‌పల్లి/ఖలీల్‌వాడి: జిల్లాలోని డిచ్‌పల్లి, నిజామాబాద్‌నగరంలో పోలీసులు మంగళవారం భారీ ఎత్తున నిషేధిత గుట్కాను మంగళవారం పట్టుకున్నారు. వ్యాన్‌లో తరలిస్తున్న రూ.39లక్షల విలువైన గుట్కాను డిచ్‌పల్లి మండలం మెంట్రాజ్‌పల్లి శివారులోని 44వ నంబర్ జాతీయ రహదారిపై పట్టుకున్నారు. వాహనంతోపాటు డ్రైవర్‌ను పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు ఎస్సై మహేశ్ తెలిపారు.

జిల్లా కేంద్రంలో..

నిజామాబాద్ నగరంలోని కిసాన్‌గంజ్‌లో ఉన్న ఓ ఏజెన్సీపై టాస్క్‌ఫోర్స్ సిబ్బంది దాడి చేసి రూ.4లక్షల విలువైన గుట్కాను స్వాధీనం చేసుకున్నారు. గుట్కా నిల్వ చేసిన ఏజెన్సీ యజమానిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ ఎస్‌హెచ్‌వో విజయ్‌బాబు తెలిపారు.

లింగంపేటలో..

లింగంపేట(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలోని రెండు పాన్‌షాపులపై దాడి చేసి నిషేధిత గుట్కాను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై చైతన్యకుమార్‌రెడ్డి తెలిపారు. ఇద్దరిపై కేసులు నమోదు చేశామన్నారు.

క్రైం కార్నర్

వేర్వేరు కారణాలతో నలుగురి బలవన్మరణం

రుద్రూర్ మండలంలో ఘటనలు

రుద్రూర్: మండల కేంద్రంతోపాటు రెండు గ్రామాల్లో వేర్వేరు కారణాలతో ముగ్గురు ఆత్మహత్య చేసుకున్నారు. మండల కేంద్రంలోని స్వీట్ షాపులో పని చేస్తున్న యువకుడు, చిక్కడ్‌పల్లిలో మహిళ, రాయకూర్‌లో వృద్ధుడు ఆత్మహత్య చేసుకున్నారు. ఆయా ఘటనలకు సంబంధించి స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి..

పెళ్లి క్యాన్సిల్ అయ్యిందని..



కైలాస్ మృతదేహం

నిశ్చితార్థం అయిన తరువాత పెళ్లి క్యాన్సిల్ అయ్యిందని మనస్తాపానికి గురై కైలాస్(20) అనే యువకుడు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. రాజస్తాన్‌కు చెందిన కైలాస్ మండల కేంద్రంలోని ఓ స్వీట్‌హోమ్‌లో పని చేస్తున్నాడు. ఇటీవలే అతడికి నిశ్చితార్థమైంది. ఆ తరువాత పెళ్లి క్యాన్సిల్ కావడంతో మనస్తాపానికి గురయ్యాడు. సోమవారం రాత్రి సహచరులతో కలిసి గదిలో నిద్రించిన కైలాస్ రాత్రి వేళలో ఉరేసుకున్నాడు. స్వీట్‌హోమ్ యజమాని సుఖ్‌రాం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై అప్పారావు తెలిపారు.


అనారోగ్యంతో మహిళ..

మండలంలోని చిక్కడపల్లికి చెందిన ఎర్రోళ్ల రేణుక (48) జీవితంపై విరక్తి చెంది ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై అప్పారావు తెలిపారు. రేణుక గత కొంతకాలంగా నరాల బలహీనత, తలనొప్పితో తీవ్రంగా ఇబ్బంది పడుతోందని, ఈ క్రమంలో సోమవారం రాత్రి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుందని ఆమె భర్త శంకర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పురుగుల మందు సేవించి వృద్ధుడు..

మండలంలోని రాయకూర్ గ్రామానికి చెందిన కాంతపు పోశెట్టి (60) పురుగుల మందు సేవించి ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై అప్పారావు తెలిపారు. కాళ్లవాపు కారణంగా గత కొంత కాలంగా నడవలేకపోతున్న పోశెట్టి జీవితంపై విరక్తి చెంది సోమవారం పురుగుల మందు సేవించాడు. గమనించిన కుటుంబ సభ్యులు బోధన్ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో నిజామాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందాడు. మృతుడి కుమారుడు శంకర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

అప్పులబాధతో యువకుడు..



దేవరాజు (ఫైల్)

దోమకొండ: అప్పులబాధ తాళలేక మండలంలోని ముత్యంపేటకు చెందిన ఆశబోయిన దేవరాజు(23) ఆత్మహత్య చేసుకున్నాడు. వివరాలు ఇలా ఉన్నాయి.. ఉపాధి నిమిత్తం ఐదేళ్ల క్రితం దుబాయికి వెళ్లిన దేవరాజు రెండేళ్ల తరువాత గ్రామానికి తిరిగివచ్చి డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. ఇటీవల కాలంలో పని లేకపోవడం, అప్పులు పెరగడంతో జీవితంపై విరక్తి చెందాడు. ఈ క్రమంలో తాను ఆత్మహత్య చేసుకుంటానని చెప్పి మంగళవారం ఉదయం ఇంట్లో నుంచి బయటికి వెళ్లాడు. ఆందోళనకు గురైన సోదరుడు స్వామి తన తమ్ముడు దేవరాజు ఆచూకీ కోసం వెతుకగా గ్రామశివారులోని వ్యవసాయబావి వద్ద చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు.

యువతి అదృశ్యం

ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): పట్టణానికి చెందిన ఓ యువతి అదృశ్యమైనట్లు ఎస్సై మహేశ్ మంగళవారం తెలిపారు. కళాశాలకు వెళ్తున్నానని చెప్పి సోమవారం ఉదయం ఇంటి నుంచి వెళ్లిన యువతి తిరిగిరాకపోవడంతో కుటుంబ సభ్యులు పలుచోట్ల వెతికారు. కళాశాలకు సైతం రాలేదని సిబ్బంది తెలిపారు. దీంతో సదరు యువతి తల్లిదండ్రులు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

మూడు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత



రుద్రూర్: పోతంగల్ మండలం హంగర్గా గ్రామం నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను తహసీల్దార్ మల్లేశ్ సోమవారం రాత్రి పట్టుకున్నారు. మండలంలోని మంజీరా నది నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారనే సమాచారం మేరకు తహసీల్దార్ రెవెన్యూ సిబ్బందితో కలిసి దాడి చేసి తిర్మలాపూర్ క్రాసింగ్ వద్ద ట్రాక్టర్లను పట్టుకున్నారు. మూడు ట్రాక్టర్లను కోటగిరి పోలీస్ స్టేషన్‌కు తరలించి బోధన్ ఆర్డీవోకు సమాచారం అందించినట్లు తహసీల్దార్ తెలిపారు. అక్రమంగా ఇసుక తరలిస్తే రెవెన్యూ చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. వాహనాలను సీజ్ చేయడంతోపాటు ఆర్టీవో, మైనింగ్ శాఖల నిబంధనల మేరకు జరిమానా విధిస్తామని స్పష్టం చేశారు.

గంజాయి విక్రేత అరెస్ట్



ఎక్సైజ్ పోలీసుల అదుపులో ఉన్న నిందితుడు

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని సిద్దులగుట్ట వెనుక ప్రాంతంలో ఉన్న ఓ రెస్టారెంట్ సమీపంలో గంజాయి విక్రయిస్తున్న మహ్మద్ వాహిద్ అలీని అరెస్టు చేసినట్లు ఎక్సైజ్ సీఐ స్టీవెన్‌సన్ తెలిపారు. విశ్వసనీయ సమాచారం మేరకు దాడి చేయగా, పెర్కిట్‌కు చెందిన మహ్మద్ వాహిద్ అలీ వద్ద 800 గ్రాముల ఎండు గంజాయి పట్టుబడిందన్నారు. అతడిని విచారించగా నాందేడ్ నుంచి ఒక కేజీ ఎండు గంజాయిని తీసుకొచ్చి 200 గ్రాముల చొప్పున చిన్న చిన్న ప్యాకెట్లుగా మార్చి విక్రయిస్తున్నట్లు తెలిపారు. అలాగే రెస్టారెంట్ పరిసర ప్రాంతంలో గంజాయి సేవిస్తున్న నలుగురిని ఆర్మూర్ తహసీల్దార్ గజానన్ ఎదుట బైండోవర్ చేశారు. దాడిలో ఎక్సైజ్ సిబ్బంది ధర్మేంధర్, సందీప్, వికాస్‌గౌడ్, నరేశ్, సాయిబాబా పాల్గొన్నారు.

ఫోన్ బుక్ చేస్తే బెల్టొచ్చింది..

- ఆన్‌లైన్ మోసానికి గురైన వ్యవసాయ కూలీ



బాధితుడు జీవన్

నవీపేట: రూ.25వేల సెల్‌ఫోన్ ఆన్‌లైన్‌లో రూ.5వేలకే వస్తోందనే ఆశతో బుక్ చేసిన వ్యక్తికి పార్సిల్‌లో బెల్ట్ వచ్చింది. వివరాలు ఇలా ఉన్నాయి.. మండలంలోని శివతండాకు చెందిన వ్యవసాయ కూలీ మెగావత్ జీవన్‌కు 15 రోజుల క్రితం ఫోన్ కాల్ వచ్చింది. రూ.25వేల విలువ చేసే ఫోన్ మీకు కేవలం రూ.5వేలకే వస్తుందని, వెంటనే ఆర్డర్ చేయాలని అవతలి వ్యక్తి నమ్మించడంతో జీవన్ ఆర్డర్ చేశాడు. మంగళవారం పార్సిల్ రావడంతో విప్పి చూసిన జీవన్‌కు బాక్స్‌లో బెల్ట్ కనిపించడంతో ఖంగుతిన్నాడు. తాను మోసపోయానని గ్రహించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు.